జగన్ పక్షాన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



పాల్గొన్న పార్టీ శ్రేణులు

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

కాళ్ల: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పక్షానే ఉన్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. ఈనెల 24వ తేదీన నిర్వహించే సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతానికి కాళ్ల మండలం పెదఅమీరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజుతో కలిసి ఆదివారం నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ఈనెల 24న ఆకివీడులో యాత్ర నిర్వహించనున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు, ఎస్సీ, బీసీ, మైనార్టీలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రత్యేక స్థానం ఇచ్చారని వివరించారు. గత పాలకులు ఓటు బ్యాంకుగా వాడుకున్నారేతప్ప బీసీలకు, బలహీన వర్గాలకు ఏమేలు చేయలేదని గుర్తు చేశారు. కానీ సీఎం జగన్ వారికి ప్రత్యేక స్థానంతోపాటు పదవులు ఇచ్చారని చెప్పారు. జగన్‌కు అందరూ అండగా నిలవాలని కోరారు. ప్రశ్నిస్తానని వచ్చిన పవన్ కళ్యాణ్ చంద్రబాబుతో పొత్తు పెట్టుకొన్నారని విమర్శించారు. ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, కాళ్ల జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, బీసీ నాయకులు గులిపల్లి అచ్చారావు, జగ్గురోతు విజయ్, మేక పార్వతి, జిల్లా యూత్ ఉపాధ్యక్షులు అంబటి రమేష్, సర్పంచులు చిగురుపాటి చిట్టిబాబు, గాలి సామ్రాజ్యం తదితరులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పీవీఎల్ నరసింహరాజును అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. బస్సు యాత్ర నిర్వహణపై గ్రామాల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించారు. పార్టీ మండల కన్వీనర్లు, నియోజకవర్గ స్థాయి నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మావుళ్లమ్మవారికి బంగారం సమర్పణ



మావుళ్లమ్మవారికి బంగారం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి మల్లవరం లంక గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసరావు, శేషవేణి దంపతులు నాలుగు గ్రాముల బంగారం సమర్పించుకున్నారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదు అందజేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు మహదేవపట్నంలో పీవీఎల్ పర్యటన

ఉండి: మండలంలోని మహదేవపట్నంలో సోమ వారం ఉదయం 9 గంటల నుంచి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పర్యటిస్తారని గ్రామ ఉప సర్పంచ్ ముదునూని సుబ్బరాజు తెలిపారు. కార్యక్రమంలో పలు సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి



విజేతలకు బహుమతి అందిస్తున్న ఎస్సై మోహన్‌రావు, సర్పంచ్ బాలకృష్ణ

భీమవరం అర్బన్: భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రూరల్ ఎస్సై బి.మోహన్‌రావు, సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ అన్నారు. భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మోహన్‌రావు, సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల బంధుత్వ, స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కేతా నాగబాబు, తెలి జోషఫ్ రవికుమార్, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్ఈబీ సీఐగా స్వరాజ్యలక్ష్మి

భీమవరం: స్థానిక ఎస్ఈబీ సీఐగా ఇ.స్వరాజ్యలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ వెస్ట్ స్టేషన్ నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన వీవీవీఎస్ఎన్ వర్మ భవానీపురం స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

నేడు ఆర్డీఓ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్‌కలెక్టర్ కార్యాలయ వర్గాలు విలేకరులకు తెలిపాయి. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్ స్వీకరిస్తారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు అందించాలని కోరారు.

23న ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): బాలల గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరంను మంగళవారం ఉదయం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహించనున్నారు. వసుధ ఫౌండేషన్ సహకారంతో విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) 15 సంవత్సరాలలోపు వయసు ఉన్న పిల్లలను పరిశీలించి, 2డి ఎకో పరీక్షలు నిర్వహించి, ఉచిత వైద్య చికిత్స చేయనున్నారు. ఈ శిబిరాన్ని భీమవరం పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు కోరారు.

లెనిన్‌కు ఘన నివాళి

భీమవరం: లెనిన్ శత వర్ధంతి సభ స్థానిక మెంటేవారితోటలోని సీపీఎం కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస థియేటర్ సెంటర్లో సీపీఐ స్థూపం వద్ద లెనిన్ చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు నివాళులర్పించారు.

ఆదిలక్ష్మి అమ్మవారి జాతర ప్రారంభం



ఆదిలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి రాజ్యలక్ష్మి పోలేరమ్మవార్ల 33వ జాతర ఆదివారం ఉదయం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. భీమవరం 18వ వార్డు పేరంటాల చెరువు గట్టు వద్ద రజక యూత్ అసోసియేషన్, శ్రీ ఆదిలక్ష్మి రజక సంఘం ఆధ్వర్యంలో గత 33 ఏళ్లుగా రాష్ట్రంలో పేరుగాంచిన 500 మంది కళాకారులు, కళా బృందాలతో గ్రామ శాంతి సౌఖ్యం కోసం ఈ జాతర నిర్వహించడం శుభదాయకమని జబర్దస్త్ నటుడు పంచ్ ప్రసాద్ అన్నారు. కొత్తపల్లి వెంకటేశ్వరరావు, అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ ఏడు రోజుల జాతర ఉత్సవాల్లో ప్రభ ఊరేగింపు, మహా జాతర, అన్న సమారాధన, అమ్మవారికి పంచ హారతులు, అమ్మవారి పవళింపు సేవ, ప్రసాద వినియోగం కార్యక్రమాలు గునుపూడి గ్రామ పెద్దలు, దాతలు, భక్తులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఆలయ అభివృద్ధి కమిటీ, దేవదాయ శాఖ ధర్మకర్తల మండలి సహకారంతో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. డప్పు వాయిద్యాలు, సన్నాయి మేళం ఆసాదుల గరగనత్యాలతో గ్రామ పొలిమేరల వరకు అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో రజక యూత్ అసోసియేషన్ నాయకులు, ఆదిలక్ష్మి రజక సంఘం నాయకులు, ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు, ధర్మకర్తల మండలి చైర్మన్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచంద్రస్వామి పట్టాభిషేకం



స్వామివారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం: అయోధ్యలో సోమవారం రాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో ఆదివారం రాత్రి పట్టణంలోని త్యాగరాజ భవనంలో ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో సీతారామచంద్రస్వామి సామ్రాజ్య పట్టాభి షేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జై శ్రీరామ్, జై శ్రీరామ్, జై శ్రీరామ్ అంటూ శ్రీరామ జపాన్ని స్మరించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి పుణ్య కార్యక్రమంలో తనని కూడా భాగస్వామిని చేసినందుకు ఆర్యవైశ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. నేడు దేశమంతటా జైశ్రీరామ్ నామం మార్మోగుతోందని, ప్రతి ఒక్కరి మనసులో కూడా అయోధ్య రాముడి ఆరాధన నెలకొందని చెప్పారు. అన్ని యుగాల్లోనూ రాముడు ఆదర్శంగా నిలిచారని, శ్రీ రామ రామ రామేతి రమే రామే మనోరమే సహస్ర నామ తత్తుల్యం రామనామ వరాననే ఈ మంత్రాన్ని ఒకసారి జపిస్తే 1000 సార్లు మహావిష్ణువును జపించినట్లుగా పురాతన ధర్మ శాస్త్రం తెలియజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మావుళ్ళమ్మ కమిటీ ఆలయ చైర్మన్ మానేపల్లి నాగన్నబాబు, సభాపతి, బొండా వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో శోభాయాత్ర



ఉండిలో నిర్వహిస్తున్న శోభాయాత్ర

ఉండి: అయోధ్య బాలరాముడి దివ్య ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉండిలో ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. ఉండి బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీరామక్షేత్రం నుంచి ఉండి, కొత్తపేట, నిమ్మలపేట సెంటర్ల మీదుగా తహసీల్దార్ కార్యాలయం, రాజులపేట పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానం వరకు నిర్వహించారు. భక్తులు శ్రీరామ సంకీర్తనలు పాడుతూ, శ్రీరామనామ జపం చేస్తూ తరించిపోయారు. 22వ తేదీ చెన్నమల్లేశరస్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. బలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించే ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఉదయం 9 గంటలకు రాజులపేటలోని శివాయం నుంచి చెరుకువాడ ఆంజనేయస్వామి విగ్రహం వరకు, అక్కడ నుంచి మండల శివారు ఆరేడు వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు.

అంబులెన్స్ వితరణ



అంబులెన్స్ వితరణ చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు రిటైర్డ్ ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజినీర్ భూపతిరాజు సత్యనారాయణరాజు కుటుంబ సభ్యుల సహకారంతో అంబులెన్స్ వాహనాన్ని చిన అమిరం విశ్వశాంతి వృద్ధాశ్రమ ఆవరణలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద ఫౌండేషన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, మానవత రాష్ట్ర విస్తరణ కమిటీ కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు, భీమవరం మానవతా సంస్థ అధ్యక్షుడు బుద్ధరాజు వెంకటపతి రాజు, కార్యదర్శి కార్మూరి నరసింహమూర్తి(బాబు), చేకూరి ఝూన్సీలు భూపతిరాజు సత్యనారాయణరాజును సత్కరించారు. కంతేటి వెంకట్రాజు, వంకాయల రామారావు, కాకర్ల వినాయక్ ,చెరుకువాడ రంగసాయి సన్నిధి నాగభూషణం, దాయన చంద్ర జి, అల్లు శ్రీనివాస్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వీరవాసరం: మండలంలోని రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983 - 84వ సంవత్సర విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో గడిపిన బాల్య స్మృతులును గుర్తుచేసుకొని సంతోషంగా గడిపారు. అద్దాల ప్రసాద్, జవ్వాది దాశరది శ్రీనివాస్, ముప్పన కొండలరావు, బండారు రామారావు, పోలిశెట్టి వెంకట్రావు, గణపతి నీడి మురళి, గెద్దం భాస్కరరావు, పోలిశెట్టి ప్రసాదు, కాయల వీరాస్వామి, ముప్పన మధుసూదనరావు పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి



క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న మత్స్యకార సొసైటీ చైర్మన్ తిరుమాని నాగరాజు

నరసాపురం రూరల్: యువత క్రీడారంగంపై దృష్టి సారించి క్రీడల్లో విజయం సాధించడం ద్వారా దేశ, విదేశాల్లో మన ప్రతిష్టను ఇనుమడింపజేసుకోవచ్చని రాష్ట్ర అగ్నికుల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు అన్నారు. మండలంలోని ఎల్బీచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండలపరిషత్ అధ్యక్షురాలు మైలాబత్తుల సోని, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ తదితరులు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని, గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లోని ఐదు విభాగాల్లో పురుషుల విభాగంలో క్రికెట్ వేములదీవి తూర్పు, వాలీబాల్‌లో వేములదీవి తూర్పు, కబడ్డీలో సీతారాంపురం సౌత్, కోకోలో చామకూరిపాలెం బ్యాట్‌మెంటన్‌లో లక్ష్మణేశ్వరం-1 సచివాలయాలు, స్త్రీల విభాగంలో క్రికెట్ తూర్పుతాళ్లు-2, వాలీబాల్ లో వైఎస్‌పాలెం, కబడ్డీలో పీఎం లంక, కోకో లో వైయస్‌పాలెం, బ్యాడ్‌మెంటిన్‌లో చామకూరిపాలెం సచివాలయాలు విజేతలుగా నిలిచాయని వ్యాయామోపాధ్యాయులు తెలిపారు. విజేతలకు క్రీడా పరిరాలను అందజేశారు.

ఆదిపరాశక్తి ఆలయానికి తరలిన భక్తులు

ఆకివీడు : ఆదిపరాశక్తి అమ్మవారిని దర్శించుకునేందుకు ఆకివీడు నుంచి తమిళనాడులోని మేల్ మరువత్తూర్‌కు భక్తులు బయలుదేరారు. ఎర్ర వస్త్రాలతో మాల ధరించిన వారు అమ్మవారికి మొక్కు చెల్లించుకునేందుకు ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్‌కు చేరుకుని రైలులో బయలుదేరి వెళ్లారు.

నేడు రెండు గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రు, ఆగర్రు గ్రామ సచివాలయాల వద్ద సోమవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు. మంగళవారం అరట్లకట్ల గ్రామ సచివాలయం వద్ద జగ నన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహిళ మృతిపై ఆందోళన

భీమవరం (ప్రకాశంచౌక్): పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామానికి చెందిన ఒక మహిళ (26) అనారోగ్య కారణంగా భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకురాగా అక్కడ వైద్య సిబ్బంది చేసిన ఇంజెక్షన్ వికటించి మృతి చెందిందని ఆమె బంధువులు ఆదివారం రాత్రి సదరు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పుష్పరాజ్‌కు దళితరత్న అవార్డు

పెనుగొండ: ఆచంట మండలం ఆచంట వేమవరం గ్రామానికి చెందిన రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ దళిత రత్న అవార్డును అందుకున్నారు. ఆదివారం ఏలూరులో గౌతమ బుద్ధ ప్రచార ట్రస్ట్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ చాగంటి సంజీవ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఆచంట వేమవరంలో వివరాలు తెలిపారు. కార్యక్రమంలో ఛైర్మన్ మంచళ్ల ఇస్సాక్, దళిత సీనియర్ నాయకులు కాపుదాసి రవికుమార్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నంది జయరాజు, జిల్లా కార్యదర్శి చిల్లే రాజ్‌కుమార్, భీమవరం పట్టణ కార్యదర్శి నేతల సాల్మన్ రాజు, ఆచంట నియోజకవర్గ క్రాయదర్శి సాక బాబు రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు దేశానికే గర్వకారణం

నరసాపురం: విజయవాడ నగరంలో సామాజిక న్యాయ మహా శిల్పం పేరుతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం దేశానికే గర్వ కారణమని షెడ్యూల్‌కులాల సంక్షేమసంఘం నరసాపురంశాఖ అధ్యక్షుడు, రిటైర్డ్ మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ తిర్రే బాబూరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంబేద్కర్ మహాశయుడు ఓ కులానికో, ఓ మతానికో ప్రతినిధి కాదన్నారు. సామాజిక న్యాయం కోసం పరితపించారని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎందరో రాజకీయ నేతలు వచ్చారని, ఎన్నో పార్టీలు అధికారంలోకి వచ్చాయని పేర్కొన్నారు. కానీ అంబేద్కర్ స్ఫూర్తిని, లక్ష్యాలను నెరవేర్చే విధంగా కొందరు నేతలు మాత్రమే పనిచేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేద్కర్ ఆశయ సాధనకు మొదటి నుంచి పని చేస్తున్నారని చెప్పారు.

డ్రెయిన్ నిర్మాణ పనుల పరిశీలన

పెనుగొండ: మాజీ మంత్రి, ఆచంట శాసన సభ్యుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో కొడమంచిలి అరుందతీపేటలో డ్రెయిన్ నిర్మించినట్లు ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ తెలిపారు. ఆదివారం ఆయన డ్రెయిన్ నిర్మాణాన్ని పరిశీలించారు. అరుందతీపేటలో టీడీపీ ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా రాజకీయంగా వాడుకుని వదలేశారన్నారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ నిర్మాణం పూర్తి చేసిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొండేటి రమేష్, పార్టీ నాయకులు పోలిశెట్టి వనమరాజు, రొక్కాల రాజ్‌కుమార్, పంచాయతీ సభ్యుడు పుచ్చకాయల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.